సాక్షి అనకాపల్లి

ఆదివారం ; 8 ; జూన్ ; 2025




హిమ సొగసు

మన్యంలోని పాడేరు ఘాట్, హుకుంపేట, జి.మాడుగుల ప్రాంతాల్లో కొద్దిరోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. వేసవిలోను కమ్ముకున్న మంచు తెరలు చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పగటి పూట ఎండ, రాత్రి చలిగాలులు ఉండటం వల్ల ఉదయం వేళల్లో మంచుతో కూడిన ప్రకృతి అందాలు ఆకట్టుకుంటున్నాయి. – సాక్షి, పాడేరు

భక్తిశ్రద్ధలతో బక్రీద్



అనకాపల్లి జామియా మసీదులో నమాజు చేస్తున్న ముస్లింలు

అనకాపల్లి టౌన్: ముస్లిం సోదరులు శనివారం జిల్లా అంతటా భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండగను నిర్వహించారు. మసీదు వీధిలో ఉన్న జామియా మసీదు, శారదానది ఒడ్డున ఉన్న దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా జామియా మసీదు అధ్యక్షుడు హుస్సేన్ మాట్లాడుతూ ఈ పండగ దయ, దాతృత్వం ప్రాముఖ్యత తెలియజేస్తుందన్నారు. సమాజంలో ఐక్యత, సోదర భావం మరిమళించేలా ఈ పర్వదినాన్ని జరుపుకొంటామన్నారు. కశింకోటలోని జామియా, నూరి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూరి మసీదు కమిటీ నూతన అధ్యక్షుడు షేక్ కరీముల్లా రెహమాన్ (బాబర్) మాట్లాడుతూ నిస్వార్థమైన ఆత్మీయత, అనుబంధాలను వ్యాపింపజేయడమే బక్రీద్ పండగ ఉద్దేశమన్నారు.



బక్రీద్ పర్వదినం సందర్భంగా ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటున్న ముస్లింలు

పరీక్ష నేల చూపులు

- ఖరీఫ్ సమీపిస్తున్నా కొలిక్కిరాని భూసార ఫలితాలు
- రెండుసార్లు గడువు పొడిగించినా సా..గుతున్న మట్టి నమూనాల సేకరణ
- ఫలితాలు వస్తేనే రైతులకు ప్రయోజనం
- ఇప్పటివరకు 84.62 శాతం మట్టి నమూనాల సేకరణ



పరీక్షల కోసం సేకరించిన మట్టి నమూనాలు



మునగపాక మండలంలో మట్టి నమూనా తీస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

యలమంచిలి రూరల్: పంటల సాగులో నేల స్వభావం కీలక పాత్ర పోషిస్తుంది. మట్టిలో తగిన పోషకాలుంటేనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయి. ఇందుకోసం భూసార పరీక్షలు చేయించి వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ సాగు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. నేల సారవంతానికి తగ్గట్టుగా ఎరువులు వాడితే మంచి దిగుబడులు పొందవచ్చు. ఇందుకు నేలలో సరైన పోషకాలు ఉన్నాయా? లేకుంటే ఎంత మోతాదులో ఎరువులు వాడాలి.. వంటి వివరాలు తప్పనిసరిగా రైతులు తెలుసుకోవాలి. కానీ జిల్లాలో భూసార పరీక్షలకు అవసరమైన మట్టి నమూనాల సేకరణ లక్ష్యానికి దూరంగా సా..గుతోంది. మట్టి నమూనాల సేకరణకు ఖరీఫ్ సీజన్ అనుకూలంగా ఉంటుంది. ఈ సీజన్‌కు ముందే వ్యవసాయ శాఖ అధికారులు మట్టి నమూనాల కోసం మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు.

రెండుసార్లు గడువు పొడిగించినా..

జిల్లాలో 24 మండలాల్లో 450 రైతు సేవా కేంద్రాల్లో ఈ ఏడాది 25,052 మట్టి నమూనాల సేకరణను లక్ష్యంగా పెట్టుకోగా ఆశించిన స్థాయిలో సేకరణ జరగలేదు. దీంతో ఇప్పటివరకు రెండుసార్లు గడువు పొడిగించినా ఇప్పటివరకు 84.62 శాతం (21,441) మాత్రమే మట్టి నమూనాలను తీశారు. నర్సీపట్నం, రోలుగుంట, సబ్బవరం మండలాల్లో మాత్రమే మట్టి నమూనాల లక్ష్యం పూర్తి చేశారు. పరవాడ, కశింకోట, బుచ్చెయ్యపేట, రాంబిల్లి, చోడవరం, మునగపాక, చీడికాడ మండలాల్లో 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. మిగిలిన మండలాల్లో మట్టి నమూనాల సేకరణపై సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారు. పాయకరావుపేట, నాతవరం, మాకవరపాలెం మండలాలు మట్టి నమూనాల సేకరణ గణాంకాల్లో అట్టడుగున ఉన్నాయి. మట్టి నమూనాల సేకరణే ఇంకా పూర్తి చేయకపోవడంతో వాటి విశ్లేషణ పూర్తి చేసి రైతులకు నివేదికల కార్డులను సకాలంలో అందజేయడం సాధ్యమేనా అనే సందేహం కలుగుతోంది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలడంతో ఇప్పటికే ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లాలో కొన్నిచోట్ల వానాకాలం సాగు కోసం రైతులు దుక్కులు దున్నుతున్నారు. మట్టి నమూనాల సేకరణకు ఈ నెల 15 వరకు గడువు పొడిగించారు. ఈ నేపథ్యంలో సేకరిస్తున్న మట్టి నమూనాల ఫలితాలు సకాలంలో అందుతాయో? లేదోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

మట్టి నమూనాల సేకరణ లక్ష్యం	25,052
సేకరించిన నమూనాలు	21,441

మట్టి సేకరణ ఇలా..

ఎంచుకున్న 2.5 ఎకరాల పొలంలో ఒక మూల నుంచి మూడు అడుగుల దూరాన్ని వదిలిపెట్టి 'వి' ఆకారంలో ఆరు అంగుళాల గుంత తీసి అడుగు నుంచి మూలల వైపు మట్టిని సేకరించాలి. ఇదే విధానంలో 10 నుంచి 20 చోట్ల జిగ్‌జాగ్‌గా మట్టిని గోనెసంచిపై వేసి బాగా కలపాలి. ఆ మట్టిని నాలుగు భాగాలుగా విభజిస్తారు. ఎదురెదురుగా ఉన్న భాగాలు తీసుకుని. మిగిలిన భాగాన్ని వదిలేస్తారు. ఇలా అర కిలో మట్టి నమూనాను తీసుకుని అనకాపల్లిలో ఉన్న భూసార పరీక్ష కేంద్రానికి పంపిస్తారు. మట్టి పరీక్షల అనంతరం సేంద్రీయ కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాషియం, జింక్, కాల్షియం వంటి పోషకాలు భూమిలో ఎంత మోతాదులో ఉన్నాయో తెలుస్తుంది. రెండేళ్లకోసారి నిర్వహించే భూసార పరీక్షల ద్వారా నేలలో పోషకాలను బట్టి అధికారుల సూచనల మేరకు ఎరువులు, మందులు ఏ మోతాదులో వేయాలో తెలుస్తుంది. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగాన్ని, అదనపు ఖర్చును తగ్గించవచ్చు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది సేకరిస్తున్న మట్టి నమూనాలకు భూసార పరీక్ష కేంద్రంలో 12 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. ఫలితాలను ఎస్‌హెచ్‌సి పోర్టల్‌లో పొందుపరుస్తున్నారు. ఫలితాలను రైతు మొబైల్‌ఫోన్‌కు తెలుగులో సంక్షిప్త సందేశం పంపేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఫలితాల విశ్లేషణ పత్రాలను కూడా రైతులకు కార్డుల రూపంలో అందజేస్తారు. పొలంలో ఉన్న పోషక స్థాయిలకు అనుగుణంగా ఎరువులను సూచిస్తారు. ఈ ప్రక్రియ అంతా ఖరీఫ్ సాగు ప్రారంభానికి ముందే పూర్తయితే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. సాగుకు ముందుగానే భూసార ఫలితాలు వచ్చేలా అధికారులు చొరవ తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

అవగాహన లేక నష్టపోతున్నాం



భూసార పరీక్షలపై చాలామంది రైతులకు అవగాహన లేదు. మట్టిలో పోషకాల గురించి తెలియక అధిక మోతాదులో ఎరువులు వాడి నష్టపోతున్నాం. వ్యవసాయశాఖ అధికారులు ఈ సీజన్‌లో గ్రామ సభలు పెట్టి రైతులను భూసార పరీక్షలపై చైతన్యవంతం చేయాలి. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, మందులు వాడాలన్న అవగాహన రైతులకు కల్పించాలి.

–పోలిరెడ్డి రమణ, రైతు, పురుషోత్తపురం

నా పొలంలో మట్టి నమూనా తీయలేదు



ఇప్పటివరకు నా పొలంలో మట్టి నమూనా తీయలేదు. ఖరీఫ్ సాగు సమయం ఆసన్నమైనా మట్టి నమూనా సేకరించకపోతే ఇంకెప్పుడు భూసార ఫలితాలు రైతులకు తెలుస్తాయో వ్యవసాయాధికారులే చెప్పాలి. భూసార పరీక్షల ఫలితాలు సకాలంలో రైతులకు అందజేస్తే రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గడంతోపాటు అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది.

–యల్లపు శ్రీనివాసరావు, రైతు, సోమలింగపాలెం, యలమంచిలి

38 తోడపెద్దులకు అచ్చులు

- శారదా నది వరకు ఘనంగా ఊరేగింపు



తోడపెద్దులను శారదానది ఒడ్డుకు ఊరేగింపుగా తీసుకువెళుతున్న దృశ్యం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం చిన్నరామస్వామి దేవాలయంలో సూరిశెట్టి తోడపెద్దు అచ్చు సేవా కార్యక్రమాన్ని పీలా లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆలయ దేవాలయ చైర్మన్ వి.పైడారావు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పైడారావు మాట్లాడుతూ జిల్లాలో 38 తోడపెద్దులకు అచ్చులు వేశామన్నారు. ఈనెల 6వ తేదీన దేవాలయం వద్ద రాత్రి భజనలు, నేలవేషాలు, తప్పెటగుళ్లు, కోలాటాలతో అత్యంత వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. శనివారం దేవాలయం నుంచి పురవీధులు గుండా 38 తోడపెద్దులను శారదానది ఒడ్డు వరకూ ఊరేగించి, అక్కడ వాటికి స్నానం చేయించి, జిల్లాలో వివిధ ప్రాంతాలకు పంపించామన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి 15వ తేదీలోగా జన్మించిన ఎద్దులను సైజు, పుట్టుమచ్చలు చూసి ఎంచుకుని దేవాలయం వద్ద అచ్చు వేయడం జరిగిందన్నారు. తోడపెద్దులను దేవునికి అంకితం చేశామన్నారు. పూర్వం ఏ ఇంట్లో శుభకార్యమైనా ముందుగా తోడపెద్దుతో అడుగు పెట్టించి, వివాహాలు చేసేవారన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల తోడపెద్దు భక్తులు పాల్గొన్నారు.

9న నియోజకవర్గ విజన్ యాక్షన్ యూనిట్ల ప్రారంభం



కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న విజన్ యాక్షన్ యూనిట్లను ఈ నెల 9న ప్రారంభించనున్నామని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. అధికారులు ఇందుకు తగ్గ ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ విజన్ యాక్షన్ యూనిట్లకు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే చైర్మన్‌గా వ్యవహరిస్తారని, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, కేటాయించిన ఐదుగురు సిబ్బంది యూనిట్లో ఉంటారన్నారు. యూనిట్లకు కేటాయించిన సిబ్బంది వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయి, నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న విజన్ యాక్షన్ యూనిట్లు సోమవారం నుంచి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు కొనసాగించాలన్నారు. యూనిట్ ఏర్పాటుకు కావలసిన వసతి, ఫర్నిచర్, కంప్యూటర్లు సమకూర్చవలసిందిగా మండల అభివృద్ధి అధికారులను ఆమె ఆదేశించారు. జిల్లా ప్రణాళిక అధికారి జి.రామారావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

నేటి నుంచి అంధ మహిళల క్రికెట్ టోర్నమెంట్

ఉక్కునగరం: ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని నిరూపించేందుకు, ఉక్కునగరం మరోసారి స్ఫూర్తిదాయక క్రీడా సంబరానికి వేదిక కానుంది. దృష్టి లోపం ఉన్న మహిళల అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం నుంచి స్టీల్‌ప్లాంట్‌లో ప్రారంభం కానున్నట్లు అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ కేరళ సంయుక్తంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నాయి. ఉక్కు స్టేడియంలో నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో ఢిల్లీ, ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడనున్నాయి. దృష్టి లోపం ఉన్న క్రీడాకారిణులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, క్రీడల్లో రాణించడానికి ఈ టోర్నమెంట్ ఒక అద్భుతమైన అవకాశమని అజయ్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్టీపీసీ సింహాద్రి సహకారంతో జరుగుతున్న ఈ పోటీల ఫైనల్స్ ఈ నెల 11వ తేదీ బుధవారం జరుగుతాయి.

యువకుడిపై పోక్సో కేసు

కోటవురట్ల: మైనర్ బాలికను వేధిస్తున్న ఓ యువకుడిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇవి.. రాజుపేట శివారు రామన్నపాలేనికి చెందిన చెలుమూరి వెంకటేష్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. కొద్ది రోజులుగా వేధింపులు ఎక్కువ కావడంతో బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. దాంతో బాలిక తల్లి శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేయడంతో చెలుమూరి వెంకటేష్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

బాలికా సాధికారతకు పెద్దపీట



బాలికా సాధికారత వర్క్‌షాపులో పాల్గొన్న బాలికలతో కలెక్టర్ విజయకృష్ణన్, ఎన్టీపీసీ ఉన్నతాధికారులు సంగీత కౌశిక్, సమీర్‌శర్మ

- 120 మంది బాలికలకు వివిధ రంగాల్లో శిక్షణ
- ఎన్టీపీసీ కృషి అభినందనీయం: కలెక్టర్ విజయ కృష్ణన్


పరవాడ: బాలికా సాధికారతకు సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం తీసుకున్న చొరవ అభినందనీయమని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. ఈ విభాగం ఆధ్వర్యంలో గత నెల 9న ప్రారంభమైన బాలికా సాధికారత మిషన్–2025 వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు విద్య నేర్పించడం ఎంత అవసరమో వివరించారు. బాలికల వ్యక్తిత్వంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్టీపీసీ కార్పొరేట్ ప్లానింగ్ ఈడీ సంగీత కౌశిక్ మాట్లాడుతూ బాలికల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్న సంస్థ చొరవను కొనియాడారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ మాట్లాడుతూ గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ ద్వారా బాల బాలికలకు యోగా, కరాటే, కంప్యూటర్, నృత్యం, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసం, చిత్రలేఖనం తదితర అంశాల్లో నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించామన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న 120 మంది బాలికలకు అవసరమైన సదుపాయాలను కల్పించడం కోసం సంస్థ రూ.50 లక్షలను వెచ్చిందన్నారు. ఈ మిషన్‌లో బాలికలకు మార్గదర్శకాలను అందించిన ఉద్యోగులను ఈడీ అభినందించారు. కార్యక్రమంలో బాలికల నృత్యాలు, ఆపరేషన్ సిందూర్, యోగా, కరాటే వంటి ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

యంత్రాలతో పనులు.. సిమెంట్ కాలువలకు ముప్పు.!



యంత్రాలతో కాలువలో పూడిక తొలగింపు

- తాండవ కాలువ పనుల్లో అవకతవకలు
- దెబ్బతింటున్న కాలువ సిమెంట్ లైనింగ్
- గట్టు దరిదాటని విధంగా వేస్తున్న పూడికతీత మట్టి
- వర్షాలకు మళ్లీ కాలువలోకే జారిపోతున్న వైనం
- కూటమి నేతల కనుసన్నల్లో పనులు



కాలువలోకి మళ్లీ జారేలా వేస్తున్న పూడిక

నాతవరం: తాండవ కాలువలో పూడికతీత పనులు పొక్లెయిన్‌తో చేపట్టడం వల్ల సిమెంట్ లైనింగ్ దెబ్బతింటోంది. ఉపాధి హామీ పథకం పనులు కూలీలతోనే చేపట్టాలన్న నిబంధనలను సైతం బేఖాతరు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోనే మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరు. అనకాపల్లి జిల్లాలో రెండు నియోజకవర్గాలు, కాకినాడ జిల్లాలో రెండు నియోజకవర్గాల పరిధిలో మేజరు, మైనరు కాలువ కలుపుకొని సుమారుగా 120 కిలోమీటర్ల పొడవున సాగునీరు ఆయకట్టుకు ప్రవహిస్తుంది. ఈ ఏడాది తాండవ కాలువలో పూడికతీత పనులను రూ.60 లక్షల ఇరిగేషన్ నిధులతో, రూ.1.50 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో అయితే కూలీలతోనే పనులు చేయించాలి. ఇరిగేషన్ నిధులతో అయితే అధిక శాతం యంత్రాలతో చేస్తున్నారు. పొక్లెయిన్‌ను తాండవ కాలువలోకి దించి పూడికతీత పనులు చేపట్టడం వల్ల సిమెంట్ లైనింగ్ పెచ్చులూడి పోతుంది. పొక్లెయిన్ ఐరన్ పళ్లతో పూడిక తొలగించడంతో పూడిక తొలగింపు మాట ఎలా ఉన్నా అధిక శాతం సిమెంట్ లైనింగ్ ధ్వంసం అవుతుందని ఆయకట్టుదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పూడిక తీసిన మట్టిని గట్టు దరిదాటని విధంగా వేస్తుండడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మళ్లీ కాలువలోకే జారిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. కూలీలతో పనులు చేయించితే సిమెంట్ లైనింగ్‌కు ఎలాంటి దెబ్బ తగలకుండా ఉంటుంది. అయితే కూలీలతో పూడిక పనులు చేపడితే ఖర్చు ఎక్కువ.. పని కాస్తా ఆలస్యంగా జరుగుతుంది. దీన్ని గమనించిన కాంట్రాక్టర్లు అధిక మొత్తంలో డబ్బులు మిగులుతాయన్న ఉద్దేశంతో యంత్రాలతో పనులు కానిచ్చేస్తున్నారు. పూడికతీత పనులు అధికంగా కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన నీటి సంఘాల ఎన్నికలు ప్రాజెక్టు కమిటీ చైర్మన్, డీసీ మెంబర్లతో పాటు కమిటీ సభ్యులు నీటి సంఘాల అధ్యక్షులు అంతా కూటమి నేతలే ఉన్నారు. దీంతో ఆయా కూటమి పెద్దలను మచ్చిక చేసుకుని పూడికతీత పనులు ఎలా చేసినా ఏం ఫర్వాలేదన్న విధంగా చేస్తున్నారన్న బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి నేతలకు భయపడి అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలో ఇంత వరకు పూడిక తీసిన కాలువలో పనులు పరిశీలిస్తే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తాయి. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు నిబంధనల ప్రకారం బాధ్యతగా చేయించాలని రైతులు కోరుతున్నారు.

స్పీకర్ అయ్యన్న ఆదేశాలు బేఖాతరు

ఇటీవల మండలంలో పర్యటనకు వచ్చిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు తాండవ కాలువ పూడికతీత పనులు ప్రధాన గేట్లు మరమ్మతు విషయంలో నిబంధనలు పాటించి నాణ్యతగా వేగవంతంగా చేయాలన్నారు. ఎవరైనా నాణ్యత పాటించకుండా పనులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అయినా అధికారులు పొక్లెయిన్‌తో పనులు చేస్తున్నారు. ఈ విషయంపై తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధను సంప్రదించగా.. పొక్లెయిన్‌తో కాకుండా మనుషులతో పూడికతీత పనులు చేస్తామన్నారు. తాను స్వయంగా ఆయా పనులు పర్యవేక్షించి ఎలాంటి సమస్య లేకుండా చేస్తానన్నారు. కొన్ని చోట్ల మద్యం సీసాలు ధ్వంసం చేశారని, అవి గుచ్చుకుంటాయ,ని అలాంటి చోట మాత్రమే యంత్రాలతో పనులు చేపడుతున్నామన్నారు.

వైఎస్సార్ హయాంలో కాలువలకు సిమెంట్ లైనింగ్

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాండవ కాలువలకు సిమెంట్ **లైనింగ్ పనులు చేపట్టారు. మొదట** విడతలో **రూ.55 కోట్లు మంజూరు చేయగా..** చాలక **పోవడంతో మళ్లీ రూ.10 కోట్లు** ఇచ్చారు. **కాలువలకు సిమెంట్ లైనింగ్ చేయడంతో శివారు ఆయకట్టుకు సైతం నీరు పు**ష్కలంగా **ప్రవహించేది.**

చదివేద్దాం.. ఓ గాంధీ పుస్తకం

- బాపు ఒక చరిత్ర కాదు.. జీవన పాఠం
- ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'గాంధియానా'
- మహాత్ముని జీవిత విశేషాల పుస్తకాల ప్రత్యేక విభాగం


మహాత్మా గాంధీ జీవితానికి సంబంధించిన పుస్తకాలు

సీతంపేట(విశాఖ): జాతిపిత మహాత్మా గాంధీ కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదు.. 20వ శతాబ్దంలో మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన మహోన్నత వ్యక్తి. సత్యం, అహింస అనే సిద్ధాంతాలను ఆయుధాలుగా మలిచి, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి మార్గాలతో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారు. ఆయన చూపిన మార్గం ప్రపంచానికి ఒక కొత్త పాఠాన్ని నేర్పింది. గాంధీజీ ఆశయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో 'గాంధియానా' పేరిట ప్రత్యేక పుస్తక విభాగాన్ని ఏర్పాటు చేశారు. గాంధీజీ చరిత్ర, జీవితం అపురూపం. ఆయన పోరాటం, సిద్ధాంతాలు, ఆశయాలపై వేలాదిగా పుస్తకాలు ప్రచురించగా.. వాటిలో సుమారు వెయ్యి వరకు పుస్తకాలు దాతల నుంచి సేకరించి ఇక్కడ అందుబాటులో ఉంచారు.

గాంధీజీ గురించి ఎందుకు చదవాలి?

గాంధీజీ జీవిత చరిత్ర, ఆయన పోరాట స్ఫూర్తి గురించి ప్రతి ఒక్కరూ తప్పక తెలుసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థి దశలోనే గాంధీజీ గురించి చదివితే నైతిక ప్రవర్తన అలవడుతుంది. తల్లిదండ్రుల పట్ల గౌరవం, పేదవారికి సహాయం చేయాలనే గుణం, దేశభక్తి వంటి సుగుణాలు పెంపొందుతాయి. తద్వారా విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగుతారు. వివేకంతో కూడిన విద్యను అభ్యసించి, మెరుగైన సమాజ నిర్మాణానికి దోహదపడతారు. అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం, శరీరశ్రమ, నిర్భయత్వం, సర్వమత సమభావం, స్వదేశీ, అస్పృశ్యతా నివారణ అనేవి గాంధీజీ పాటించిన ఏకాదశ వ్రతాలు. మత సామరస్యం, అస్పృశ్యతా నివారణ, మద్యపాన నిషేధం, ఖాదీ, గ్రామ పరిశ్రమలు, మౌలిక విద్య, పారిశుధ్యం ఆరోగ్య నియమాలు, ప్రాంతీయ భాషాభివృద్ధి, వయోజన విద్య, స్త్రీ సాధికారత, జాతీయ భాష, ఆర్థిక సమానత్వం, రైతు సంక్షేమం, కార్మిక సంక్షేమం, ఆదివాసుల వికాసం, కుష్టు రోగుల సేవ తదితరవి మహాత్ముడు అవలంబించారు. వీటన్నింటి గురించి తెలుసుకునేందుకు గాంధీజీకి సంబంధించిన పుస్తకాలు చదివేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి.స్వామి వివేకానంద చెప్పినట్లు 'క్యారెక్టర్, కరికులమ్, కల్చర్'అనే మూడింటిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలి.

వేల పుస్తకాలు.. కోట్ల ప్రతులు

ముంబయిలోని సర్వోదయ మండల్, గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్లు గాంధీజీపై వచ్చిన సుమారు 7 వేల పుస్తకాలను సేకరించి భద్రపరిచాయి. గాంధీజీ స్థాపించిన నవజీవన్ ట్రస్ట్ ఆయన ఆత్మకథ 'సత్యశోధన'ను 17 భారతీయ భాషలతో పాటు ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్, కొరియన్, జపనీస్, చైనీస్ భాషల్లో ప్రచురించింది. కోటికి పైగా గాంధీజీ ఆత్మకథ పుస్తకాలు అమ్ముడయ్యాయంటే అతిశయోక్తి కాదు.


ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'గాంధియానా రిఫరెన్స్'బుక్స్ విభాగం

తప్పక చదవాల్సిన కొన్ని పుస్తకాలు

ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్(సత్యశోధన), గాంధీ: ది ఇయర్స్ దట్ ఛేంజ్డ్ ది వరల్డ్(రామచంద్ర గుహ), గాంధీ బిఫోర్ ఇండియా(రామచంద్ర గుహ), ఇండియా ఆఫ్టర్ గాంధీ(రామచంద్ర గుహ), మై డియర్ బాపు(సి.రాజగోపాలాచారి గాంధీజీకి రాసిన లేఖలు), ది గుడ్ బోట్‌మ్యాన్(రాజమోహన్ గాంధీ), గాంధీ: ప్రిజనర్ ఆఫ్ హోప్(జుడిత్ ఎం. బ్రౌన్), ది డెత్ అండ్ ఆఫ్టర్‌లైఫ్ ఆఫ్ మహాత్మా గాంధీ(మకరంద్ పరాంజపే), హింద్ స్వరాజ్ లేదా ఇండియన్ హోమ్ రూల్(గాంధీ–1909), ఐయామ్ గాంధీ(బ్రాడ్ మెల్జర్), మై డేస్ విత్ గాంధీ(నిర్మల్ కుమార్ బోస్), ది లైఫ్ ఆఫ్ మహాత్మాగాంధీ(లూయీ ఫిషర్), ఎ వీక్ విత్ గాంధీ(లూయీ ఫిషర్), మహాత్మా గాంధీ: హిజ్ లైఫ్ అండ్ ఐడియాస్(చార్లెస్ ఎఫ్. ఆండ్రూస్, అరుణ్ గాంధీ), ది మ్యాన్ బిఫోర్ ది మహాత్మా(చార్లెస్ డిసాల్వో), ది లివింగ్ గాంధీ: లెసన్స్ ఫర్ అవర్ టైమ్స్(తారా సేథియా), గాంధీ అండ్ మావో ఇన్ క్వెస్ట్ ఆఫ్ అనాలజీ(రతన్ దాస్), గాంధీ సీఈవో(అలాన్ ఆక్సెల్‌రాడ్)


నైతిక విలువలు పెరుగుతాయి



గాంధీజీ గురించి చదవడం వల్ల నైతిక ప్రవర్తన అలవడుతుంది. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే గాంధీజీ గురించి చదవాలి. కనీసం ఆయన ఆత్మకథ 'ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్'పుస్తకాన్ని అయినా చదవాలి. కళాశాలలో చేరేటప్పుడు ప్రతి విద్యార్థికి యాజమాన్యం గాంధీజీ ఆత్మకథ పుస్తకాన్ని అందజేయాలి. ఏడాది చివరలో నాన్ క్రెడిట్ (మార్కులతో నిమిత్తం లేకుండా) పద్ధతిలో పరీక్ష నిర్వహించి ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చూడాలి. దీని వల్ల ప్రతి ఒక్కరిలో నైతిక విలువలు పెరుగుతాయి. ఇలా చేస్తే మెరుగైన సమాజం ఏర్పడటానికి దోహదపడినవారవుతారు. అలాగే సచివాలయ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు వారం, పది రోజుల పాటు శిక్షణ ఇవ్వడం ద్వారా గాంధీజీ సిద్ధాంతాలు, ఆశయాలపై అవగాహన కల్పించవచ్చు. దీని వల్ల వారిలో అంకితభావం పెరుగుతుంది.

– ఆచార్య వి.బాలమోహన్‌దాస్, గాంధీ సెంటర్ అధ్యక్షుడు

గాంధేయవాదం ఆదర్శం



గాంధేయవాదం అన్ని కాలాలకు, అన్ని సమాజాలకు వర్తించే మహత్తర భావన. యువత వ్యక్తిత్వ వికాసానికి గాంధీజీ ఆలోచనలు, ఆశయాలు ఎంతగానో దోహదపడతాయి. ఆయన ఆశయాలు భావితరాలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతోనే పౌరగ్రంథాలయంలో 'గాంధియానా రిఫరెన్స్'పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. గాంధీ సెంటర్ వ్యవస్థాపకుడు కె.ఎస్.శాస్త్రి బహూకరించిన వందలాది అమూల్యమైన పుస్తకాలు యువతకు దిశానిర్దేశం చేయగలవు. ఇవి కేవలం అలనాటి జాతీయోద్యమ చరిత్రనే కాక, సామాజిక రుగ్మతలపై గాంధీజీ సాగించిన పోరాటాన్ని, ఆయన సంస్కరణ దృక్పథాన్ని ఈ తరం వారికి స్పష్టం చేస్తాయి. గాంధీ గురించి ఏ సమాచారం అయినా ఈ పుస్తకాల్లో లభిస్తుంది.

– డి.వి.సూర్యారావు, రచయిత

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి (ఫైల్)

యలమంచిలి రూరల్ : మండలంలోని తండాలదిబ్బ కూడలికి సమీపంలో జంపపాలెం గ్రామానికి వెళ్లే రహదారి పక్కన నీరు లేని పంటకాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న యలమంచిలి రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఇటీవల ఈ ప్రాంతంలో చొక్కా లేకుండా జీన్స్ ప్యాంటుతో తిరుగుతూ, మతిస్థిమితం లేనట్టు కనిపించాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. కొందరు స్థానికులు అతని ఫొటోను కూడా తీశారు. ఈ ఫొటో పోలీసులు మీడియాకు విడుదల చేశారు. మృతుడి వయస్సు సుమారు 30–35 ఏళ్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇటీవల ఎండల తీవ్రతకు ఆహారం, నీరు లేకపోవడంతో నీరసించి చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. వీఆర్వో పిల్లి గంగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు యలమంచిలి రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440796104, 9440796079 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని పోలీసులు కోరారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

నాతవరం : గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు నాతవరం ఎస్ఐ సీహెచ్ భీమరాజు తెలిపారు. నర్సీపట్నం–తుని మధ్య గల ఆర్అండ్‌బి రోడ్డులోని తాండవ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, నర్సీపట్నం వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు బ్యాగుతో తుని వైపు నడుచుకుంటూ వచ్చారు. వారి నడకలో అనుమానం వచ్చి బ్యాగును తనిఖీ చేయగా, అందులో 4.5 కిలోల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన వారిలో గుంటూరు జిల్లా గుడివాడ గ్రామానికి చెందిన మల్లిపూడి ఆశీష్‌తో పాటు ఒక మైనర్ ఉన్నారు. వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 22,500 ఉంటుందని ఎస్ఐ భీమరాజు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు


సింహగిరిపై భక్తుల రద్దీ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ముగుస్తుండటంతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు తరలి వచ్చారు. భక్తులతో దర్శన క్యూలు, కేశఖండనశాల, అన్నప్రసాద భవనం, ప్రసాద విక్రయశాల కిక్కిరిశాయి. అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు రావడంతో ట్రాఫిక్ స్తంభించింది. కాగా శనివారం ఒక్కరోజే దేవస్థానంలోని అన్ని విభాగాల ద్వారా సుమారు రూ.51 లక్షల ఆదాయం సమకూరింది.

విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే యోగ


రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో యోగ ప్రదర్శనలు చేస్తున్న ఉపాధ్యాయులు


ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు యోగాను నేర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు పేర్కొన్నారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా విద్యాశాఖ, జిల్లా ఆయుష్ శాఖ సహకారంతో యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో అప్పారావు నాయుడు మాట్లాడుతూ రోజూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. యోగా ప్రాధాన్యతను ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందని, ప్రతిరోజూ ప్రార్థన, డ్రిల్ కార్యక్రమంలో యోగా ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఆయుష్మాన్ అధికారిణి డాక్టర్ కె. లావణ్య మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. అనంతరం యోగ గురువులు దొరమ్మనాయుడు, బి.అప్పారావుల ఆధ్వర్యంలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు సాగింది. కార్యక్రమంలో డీఎస్‌డీవో రమణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోటూరి నాగేశ్వరావు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వెంకట్రావు, కార్యదర్శి మహలక్ష్మినాయుడు, మండల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియామకం


ఆస్పత్రి డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాసరావు, వేదికపై కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం జరిగింది. కమిటీ చైర్‌పర్సన్‌గా కలెక్టర్ విజయ కృష్ణన్, వైస్ చైర్మన్‌గా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వ్యవహరిస్తారు. డైరెక్టర్లుగా డాక్టర్ డి.డి.నాయుడు, ఆళ్ళ రామచంద్రరావు, తాడి శాంతికుమారి, గొర్లి శేఖర్, ఉలింగల రమేష్‌లను ఎంపిక చేయగా వీరితో జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.


యోగాతో సమస్యలు తీరవు


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

ఎస్.రాయవరం: యోగాసనాలతో ప్రజల సమస్యలు తీరిపోవు..కేవలం ప్రజల దృష్టి మరల్చిందుకు ప్రధాని నరేంద్రమోదీ యోగా జపం చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ అన్నారు. వెంకటాపురం గ్రామంలో ఉపాధి కూలీలతో శనివారం సత్యనారాయణ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మే 21 నుంచి జూన్ 21 నెలరోజులు పాటు యోగా కార్యక్రమాలు చేపట్టేందుకు పిలుపునిచ్చిందన్నారు. ఎద్దు ఈనిందంటే దూడను కళ్లెంతో కట్టేయమన్నట్లుగా కేంద్రం ఇలా పిలపునిచ్చిందో లేదో వెంటనే యోగాంధ్ర అంటూ రాష్ట్రం ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమం ముగింపురోజున విశాఖకు నరేంద్రమోదీ వస్తున్నారన్నారని, ఆ రోజున రెండు లక్షల మందితో యోగాసనాలు వేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

లోటు బడ్జెట్‌తో రాష్ట్రం కొట్టుమిట్టాడుతుంటే.. విశాఖలో యోగా ఎందుకని ప్రశ్నించారు. ఆంధ్రుల హక్కుగా పిలిచే విశాఖ ఉక్కు ఖర్మాగారాన్ని ఆదుకునే సమయం లేదు, కాని యోగాసనాలకు సమయం ఎలా వచ్చిందని విమర్శించారు. ఇకనై మోదీ ఆంధ్రాను ఎలా ఆదుకుంటారో ప్రకటన చేయాలన్నారు.

వీధి కుక్కల దాడిలో ఐదు మేకల మృతి


వడ్డాదిలో వీధి కుక్కలు దాడిలో మృతి చెందిన మేకలు

బుచ్చెయ్యపేట : మండలంలోని వడ్డాది గ్రామంలో వీధి కుక్కల దాడిలో ఐదు మేకలు మృతి చెందాయి. ఈ ఘటనలో సుమారు రూ. 35 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు కురందాసు నాయుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కురందాసు నాయుడు శుక్రవారం రాత్రి తన పొలం వద్ద ఉన్న పాకలో మేకలను ఉంచి వచ్చాడు. శనివారం ఉదయం వెళ్లి చూడగా, పాకలో ఐదు మేకలు తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నాయి. మేకల ఒంటిపై ఉన్న గాయాలను బట్టి వీధి కుక్కలు దాడి చేసినట్లు గుర్తించాడు. ఇటీవలి కాలంలో వడ్డాది పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైందని స్థానికులు చెబుతున్నారు. మేకలు, గొర్రెలు, ఆవు, గేదె దూడలతో పాటు నాటు కోళ్లపై కూడా వీధి కుక్కలు దాడి చేసి గాయపరుస్తూ, ప్రాణాలు తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల బెడదను నివారించి, తమ పశుసంపదను కాపాడాలని పంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అయ్యో పాపం!

- నిద్రపోతున్న కూలీని గమనించని లారీ డ్రైవర్
- నల్ల పిక్కలో కూరుకుపోయి దుర్మరణం
- మూడు రోజుల తర్వాత వెలుగుచూసిన విషాద ఘటన


ముదపాకలో ఘటనాస్థలంలో సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: ఓ నిర్మాణ కూలీ జీవితం నిద్రలోనే కడతేరింది. తాను పనిచేస్తున్న చోటే సేద తీరుతుండగా విధి చిన్న చూపు చూడటంతో ఊపిరాడక అసువులు బాశాడు. పెందుర్తి మండలం ముదపాకలోని జగనన్న కాలనీలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పెందుర్తి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా తెర్లాం మండలం నందబలగ గ్రామానికి చెందిన పక్కి సూరన్నదొర (57), గంగమ్మ దంపతులు కుటుంబంతో కలిసి ముదపాకకు వలస వచ్చి ఇక్కడి జగనన్న కాలనీలో నిర్మాణ పనులు చేస్తుంటారు. సూరన్నదొర అన్న కుమారుడు పక్కి ప్రసాద్ ఈ నెల 4న ఇదే ప్రాంతంలో బావిలో పడి మృతి చెందాడు. ఈ క్రమంలో ప్రసాద్ మృతదేహం పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు వెళ్లిన సూరన్న.. నీరసంగా ఉండటంతో ముదపాకలోని ఇంటికి తిరిగి వచ్చేశాడు. తీవ్ర విషాదంలో ఉన్న సూరన్న ముదపాకలోనే ఉన్న బంధువులతో అదే రోజు సాయంత్రం మద్యం సేవించాడు. ఉదయం మళ్లీ కేజీహెచ్‌కు వెళ్లి మృతదేహంతో ఊరికి వెళతానని చెప్పాడు. అనంతరం సమీపంలో నిర్మాణం కోసం పోసి ఉన్న నల్ల పిక్క రాశిపై పడుకున్నాడు. అయితే అర్ధరాత్రి అక్కడికి పిక్క వేసేందుకు వచ్చిన లారీ డ్రైవర్ సూరన్న నిద్రిస్తున్న విషయాన్ని గమనించకుండా అతని పైనే అన్‌లోడ్ చేసేశాడు. అప్పటికే గాఢ నిద్రలో ఉన్న సూరన్నదొర ఊపిరాడక మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు.

మూడు రోజుల తర్వాత వెలుగులోకి...

కేజీహెచ్‌కు వెళతానని చెప్పిన సూరన్న కనిపించకపోవడంతో విజయనగరం వెళ్లిపోయాడని అందరూ భావించారు. కానీ అతను అక్కడికి కూడా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ప్రసాద్ అంత్యక్రియలు నిర్వహించకుండా చాలాసేపు ఎదురుచూశారు. చివరకు ఆ కార్యక్రమం పూర్తి చేసుకున్న కుటుంబ సభ్యులు గురువారం తిరిగి ఇక్కడికి వచ్చి సూరన్న ఆచూకీ కోసం ఆరా తీశారు. ఈ క్రమంలో అతను అదృశ్యమైనట్లు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేద్దామని నిర్ణయించుకున్నారు. అయితే శనివారం ఉదయం కాలనీలో నిర్మాణ పనుల కోసం నల్ల పిక్కను తరలించేందుకు పొక్లెయిన్‌తో లారీలకు లోడ్ చేస్తున్నారు. ఆ సమయంలో నల్ల పిక్క రాశి నుంచి ఓ చేయి బయటకు కనిపించడం, ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా దుర్వాసన రావడంతో ఆందోళనకు గురైన పొక్లెయిన్ ఆపరేటర్ విషయాన్ని కాలనీవాసులకు, గ్రామస్తులకు తెలిపాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయగా, అది సూరన్నదొరదేనని కుటుంబ సభ్యులు గుర్తించారు. ప్రాథమిక విచారణ చేపట్టిన సీఐ కె.వి.సతీష్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏడాది కిందట రైలు ప్రమాదంలో సూరన్న కుమారుడు, మూడు రోజుల కిందట ప్రమాదవశాత్తు బావిలో పడి అతని అన్న కుమారుడు మృతి చెందడంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబంలో.. ఈ తాజా విషాదం చోటుచేసుకోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి సిమెంట్ వితరణ

కశింకోట : నరసింగబిల్లిలో వెలసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాల నిర్మాణానికి సాగర్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం తరఫున శనివారం సిమెంట్ వితరణ చేశారు.

నాగదేవత అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్టకు సిద్ధంగా నాగదేవత అమ్మవారి విగ్రహాలు

అనకాపల్లి టౌన్ : తుమ్మపాల గ్రామం అంబేడ్కర్ కాలనీలో వెలసిన నాగదేవత అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నాగదేవత అమ్మవారి విగ్రహ ఊరేగింపు గ్రామంలో నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాధారణ, హోమాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు శ్రీను, జాన్ అప్పారావు, కోనపల్లి అప్పారావు, భీంపల్లి రాజు, సాయి కిరణ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

15 వాహనాలకు జరిమానా



కశింకోటలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్ఐ కె. లక్ష్మణరావు

కశింకోట : కశింకోటలో జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి నడుపుతున్న సుమారు 15 వాహనాలకు జరిమానా విధించినట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని, కారులో సీటు బెల్టులను ధరించాలని వాహన చోదకులకు ఈ సందర్భంగా అవగాహన కలిగించామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నర్సీపట్నం : హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం బ్లడ్ సెంటర్ నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంలో ఉద్యోగులు, యువకులు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, విద్యార్థులు రక్తదానం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉమానారాయణ హాస్పటల్ డాక్టర్ మల్లికార్జున్, వి.వి.ఎస్ నర్సింగ్ హోమ్ డాక్టర్ నూకరాజు పాల్గొన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో 9 సార్లు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశామని హ్యాండ్స్ వ్యవస్థాపకులు టి.మల్లేష్ పేర్కొన్నారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన జి.శ్రీనివాస్ తదితరులను సన్మానించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 113 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మెదటి రకం	4,700	4,700
రెండవ రకం	3,660	3,660
మూడవ రకం	3,400	3,610

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: గ్యాంబ్లర్స్
సత్యనారాయణ స్క్రీన్-2	: 007
పర్తిసాయి	: ఖలేజా
షిర్డీసాయి	: థగ్ లైఫ్
వెంకటేశ్వర	: రాజావారు
శ్రీ సత్య	: శుభం
రామచంద్ర	: పాడేరు 12వ మైలు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 22 యూనిట్లు, బీ పాజిటివ్ -9 యూనిట్లు, ఓ పాజిటివ్ -28 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -7 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ లోకేష్‌ను 9703619706ను నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 347 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 281 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

జగనన్న కాలనీలపై సర్కారు శీతకన్ను



మారేడుపూడి పంచాయతీ జగనన్న కాలనీలో గృహాలు

- మౌలిక సదుపాయాల కల్పనపై నిర్లక్ష్యం
- మండలంలో వైఎస్సార్‌సీపీ పాలనలో 5 వేల పట్టాలు పంపిణీ
- ఇప్పటికే 900 గృహాల్లో నివాసం
- మరో 900 గృహాలు ప్రారంభానికి సిద్ధం
- కొరవడిన డ్రైనేజీలు, రహదారులే, విద్యుత్ లైట్లు



సంపతిపురం జగనన్న కాలనీ రహదారి

అనకాపల్లి : బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సొంతింటి కల వైఎస్సార్‌సీపీ పాలనలో నెరవేరిందని ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. గూడు లేని పేదవాడికి గృహమే సరైన చిరునామాగా ఆనందం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రెండేళ్లు కరోనతో ప్రజలు ఇబ్బందులు పడడంతో జగనన్న గృహాలు పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు జరగలేదు. జగనన్న పాలనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంలో పేదవాడికి గృహాన్ని నిర్మించి ఇవ్వాలని శ్రీకారం చుట్టారు. అనకాపల్లి మండలంలో కొత్తూరు, తుమ్మపాల మేజర్ పంచాయతీలు పరిధిలో తప్ప మిగిలిన అన్ని పంచాయతీల్లో సుమారుగా 5వేల మంది నిరుపేదలకు గృహపట్టాలు వైఎస్సార్‌సీపీ పాలనలో అందజేశారు. అనకాపల్లి పట్టణంలో నివసించే నిరుపేదలకు అనకాపల్లి మండలంలో కోడూరు పంచాయతీ పీతపాలెం గ్రామంలో జగనన్న లే అవుట్‌లు వేసి గృహాలు అప్పటి ప్రభుత్వమే నిర్మించి ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. గృహాలు నిర్మిస్తున్న సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో జగనన్న గృహాల నిర్మాణం ఏడాది నుంచి నత్తనడకన సాగుతుంది. దీనిలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొంత ఇంటిలో ఎప్పుడు గృహ ప్రవేశాలు చేయాలో అర్థం కాని పరిస్థితిలో జీవిస్తున్నారు.

- అనకాపల్లి మండలంలో మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం, కోడూరు, సంపతిపురం, మామిడిపాలెం, బవులవాడ, సీహెచ్.ఎన్.అగ్రహారం, గొలగాం, గోపాలపురం, ఎరుకువానిపాలెం, రాజుపాలెం, సీతానగరం, తరగరంపూడి, కుంచంగి, కూండ్రం తదితర గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో జగన్న లే అవుట్‌లు వేశారు.
- మండలంలో మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం, గోపాలపురం, మామిడిపాలెం గ్రామంతో పాటు మరికొన్ని గ్రామాల్లో సుమారుగా 900 మంది లబ్ధిదారులు జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకుని గృహప్రవేశాలు చేసి కుటుంబ సమేతంగా నివసిస్తున్నారు.
- మరికొన్ని గ్రామాల్లో సుమారుగా 900 గృహాలు నిర్మాణాలు పూర్తి అయినప్పటికీ గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నారు.
- మిగిలిన 3200 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాలు కూటమి ప్రభుత్వంలో నత్తనడకన సాగుతున్నాయి.
- పేదవాడి సొంతింటి నిర్మాణాలు పూర్తయి రెండేళ్లగా గృహప్రవేశాలు చేసి నివసిస్తున్నప్పటికీ అక్కడి ప్రజలకు సరైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది.
- తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో భయంభయంగా గృహాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది.
- మండలంలో సంపతిపురం పంచాయతీ పరిధిలో కొత్తూరు, సంపతిపురం గ్రామాల పేదవారికి సంపతిపురం ప్రభుత్వ స్థలంలో సుమారుగా 355 గృహాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టాలు ఇస్తే, 200 గృహాలకు ప్రజలు గృహప్రవేశం చేశారు. రహదారులు, వీధి లైట్లు, తాగునీరు లేకపోవడంతో 80 కుటుంబాల ప్రజలు మాత్రమే జీవిస్తున్నారు. ఈ విషయంపై ఏడాది నుంచి కలెక్టర్ విజయకృష్ణన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు, ఎమ్మెల్యే, ఎంపీలకు వినతిపత్రాలు అందజేస్తున్నప్పటికీ ఆ ప్రాంత ప్రజల సమస్య నేటికీ పరిష్కారం కాలేదు.
- మామిడిపాలెం గ్రామంలో సుమారుగా 423 జగనన్న గృహాలకు గాను, 270 మంది నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలోనూ మౌలిక సదుపాయాలు కల్పించలేదు.



డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మారేడుపూడి కాలనీలో రహదారిపై పారుతున్న డ్రైనేజీ



సంపతిపురం జగనన్న కాలనీలో రహదారి, డ్రైనేజీ నిర్మించాలని కాలనీ వాసుల ధర్నా(ఫైల్)



మారేడుపూడి జగనన్న కాలనీలో రహదారిపై రాళ్లు

మౌలిక సదుపాయాలు కల్పించాలి



రెండేళ్ల క్రితం సంపతిపురం జగనన్న లే అవుట్‌లో గృహప్రవేశం చేశాను. తాగునీరు, విద్యుత్ వీధి లైట్లు, డ్రైనేజీలు నిర్మించాలని కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీకి ఏడాది నుంచి ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం జరగలేదు. రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు రావాలంటే భయం..భయంగా ఉంది. వర్షం పడితే రహదారిపై నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– వి.పార్వతి, సంపతిపురం జగనన్న లే అవుట్, అనకాపల్లి మండలం

డ్రైనేజీలు ఎప్పుడు నిర్మిస్తారు..



మారేడుపూడి పంచాయతీ పరిధిలో కొండ వద్ద జగనన్న కాలనీలో గృహం నిర్మించుకున్నాను. కుటుంబ సమేతంగా నివసిస్తున్నాం. వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మించకపోవడంతో గృహాల్లో వాడిన డ్రైనేజీ రహదారులపై ప్రవహిస్తుంది. వ్యాధుల బారిన పడకుండా ముందుగా అధికారుల చర్యలు తీసుకోవాలి.

– ఎం.రమణ, మారేడుపూడి గ్రామం

ఘనంగా శ్రీనివాసుని కల్యాణోత్సవం



కశింకోటలో ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శ్రీనివాసుని కల్యాణోత్సవం



అన్న సమారాధనలో భక్తులు





ధ్యాన వేంకటేశ్వరస్వామి అలంకరణ, కల్యాణం తిలకిస్తున్న భక్తులు

కశింకోట: కశింకోటలోని శివాలయం వద్ద వెలసి ఉన్న ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం సాయంత్రం శ్రీనివాసుని కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. జేష్ఠ మాసం శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని రెండు రోజుల పాటు నిర్వహించే స్వామి వారి 8వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా కల్యాణం జరిపించారు. 12 మంది దంపతులతో వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా శ్రీనివాసుడు, భూదేవి, శ్రీదేవిల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం కనువిందుగా చేశారు. గణేష్ పూజ, విశ్వక్సేన పూజ, యజ్ఞోపవీతం ధారణ, నూతన వస్త్రాలంకరణ, కన్యాదానం, సుముహూర్తాన జీలకర్ర, బెల్లం పెట్టడం, మాంగళ్య ధారణ, తలపై ముత్యాలు వేయడం, బ్రహ్మముడి, కర్పూర దండలు ధారణ, చివరిగా మంగళ హారతితో స్వామి కల్యాణాన్ని కళ్లకు కట్టే విధంగా నిర్వహించారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు రేజేటి సీతారామచార్యులు, మారుతి వేంకటాచార్యులు, రామచరణాచార్యులు తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణాన్ని ఆద్యంతం భక్తులు కనులారా తిలకించి భక్తి పారవశ్యం చెందారు. ఉదయం స్వామి వారి మూల విరాట్ విగ్రహాన్ని వజ్ర కవచాలంకృతులతోపాటు వివిధ పూల మాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించి ముస్తాబు చేశారు. ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం గరుడోత్సవం (తిరువీధి) ఉత్సవం జరగనుందని అర్చకుడు రామచరణాచార్యులు తెలిపారు.

భక్తి, త్యాగనిరతికి ప్రతీక బక్రీద్



కశింకోటలోని నూరి మసీదులో ముస్లింల బక్రీద్ ప్రార్థనలు

కశింకోట : కశింకోటలో ముస్లింలు శనివారం బక్రీద్ పండగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే పండగ సందర్భంగా స్థానిక జామియా, నూరి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నూరి మసీదులో మత గురువు జియా హుల్ రెహమాన్ మాట్లాడుతూ ఈద్ అల్ అదా (బక్రీద్) త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే పండగ అన్నారు. నూరి మసీదు కమిటీ నూతన అధ్యక్షుడు షేక్ కరీముల్లా రెహమాన్ (బాబర్) మాట్లాడుతూ భక్తికి, విశ్వాసానికి , త్యాగ నిరతికి, దాతృత్వానికి ప్రతీకగా బక్రీద్ పర్వదినాన్ని సమాజంలో ఐక్యత, సోదర భావం, సౌభ్రాతృత్వం పరిమళించేలా జరుపుకోవడం జరుగుతుందన్నారు. నిస్వార్థమైన ఆత్మీయత, అనుబంధాలను వ్యాపింప జేయడమే బక్రీద్ పండగ ఉద్దేశమన్నారు. నూరి మసీదు కమిటీ మాజీ అధ్యక్షుడు షెహద్ రెహంతుల్లా, ప్రతినిధులు హాజీ హసన్ మాస్టార్, ఎం.ఎం రబ్బాని, ఎస్ఎంఎం అలీ, సయ్యద్ మహబుబ్ సుభాని, అబ్దుల్ రజీక్, సయ్యద్ అన్వర్ పాల్గొన్నారు. మండలంలోని నరసింగబిల్లిలో ఉన్న మసీదులో ముస్లింలు ప్రార్థనలు జరిపారు.

ఈదురు గాలులతో భారీ వర్షం



చెరువును తలపిస్తున్న ఎన్టీఆర్ స్టేడియం

అనకాపల్లి టౌన్ : పట్టణంలో శనివారం ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. గత నాలుగైదు రోజుల నుంచి తీవ్ర ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా కురిసిన వర్షంతో సేదతీరారు. సుమారు గంటసేపు కురిసిన వర్షం వాతావరణ శాఖ అధికారుల లెక్కల ప్రకారం 34.0 మి.మీగా నమోదైంది. సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఎన్టీఆర్ స్టేడియంలోకి బయట రోడ్ నుంచి నీరు లోపలికి రావడంతో చెరువును తలపించింది. దీంతో క్రీడాకారులు, వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గవరపాలెం పార్కు సెంటర్, నూకాంబిక అమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారి, రైల్వే అండర్ బ్రిడ్జి, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలన్నీ నీటమునిగాయి. దీంతో వివిధ గ్రామాల నుంచి పనులపై వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కశింకోట : కశింకోట ప్రాంతంలో వరుసగా రెండో రోజు శనివారం మధ్యాహ్నం పెను గాలులతో వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో సతమతమైన ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. అప్పటి వరకు అధిక ఉష్ణోగ్రతతో ఎండ కాసిన ఆకాశంలో ఒక్కసారిగా దట్టమైన మేఘాలు కమ్ముకొని పెను గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో నాలుగు గంటలకు పైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఉదయం కూడా తరచుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పాటు గాలి వర్షం వల్ల కూడా గంటల తరబడి విద్యుత్ నిలిచిపోవడం ప్రజలు తీవ్ర ఇబ్బంది చెందారు. వర్షం వల్ల రోడ్లు బురదమయంగా మారాయి. మధ్యాహ్నం వరకు కాసిన ఎండ వల్ల గ్రామ వీధుల్లో జన సంచారం లేక వెలవెల బోయాయి.



జలమయమైన ఎన్టీఆర్ ఆసుపత్రికి వెళ్లే రోడ్



నీటమునిగిన రైల్వే అండర్ బ్రిడ్జి

జలగల మదుం వల్ల చీకట్లు



పట్టణంలో జలగల మదుం జాతీయ రహదారిలో వెలగని విద్యుత్ లైట్లు

అనకాపల్లి : జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటికీ అనకాపల్లి ప్రధాన జంక్షన్ జలగల మదుం వద్ద సుమారుగా 15 రోజులుగా విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జంక్షన్ వద్ద విశాఖ నుంచి అనకాపల్లికి వచ్చే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జాతీయ రహదారిని అనుకుని అనకాపల్లి పట్టణంలోనికి వచ్చే వాహనదారుల, జాతీయ రహదారిపై నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు, పక్కనే ఉన్న ఆవఖండం భూమిలో నుంచి వచ్చే ప్రజలు రాత్రి సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై జాతీయ రహదారి అధికారులు చర్యలు తీసుకుని విద్యుత్‌లైట్లు వెలిగే విధంగా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

వేతన కార్యదర్శులకు కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ

అనకాపల్లి: విశాఖ డెయిరీ వేతన కార్యదర్శులు, హెల్పర్స్ 40 ఏళ్లుగా డెయిరీ అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నా నేటికీ కనీస వేతనాలు అమలు చేయడం లేదని విశాఖ డెయిరీ కార్యదర్శులు, హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డెయిరీ యాజమాన్యానికి అనేకసార్లు కనీస వేతనం అమలు చేయాలని, గ్రాట్యూటీ రూ.5 లక్షలు, డ్యూటీ టైమింగ్స్‌ను ఫిక్స్ చేయాలని కోరినప్పటికీ యాజమాన్యంలో కనీస చలనం లేకుండా పోయిందన్నారు. కనీస వేతనం ఇవ్వాలని డెయిరీ యాజమాన్యంతో చర్చలు జరిపిన సందర్భంలో 20 శాతం పెంచి జీతాలు చెల్లిసామని ఇచ్చిన హామీ నేటి వరకూ అమలు చేయలేదన్నారు. 200 పాల లీటర్లలోపు ఉన్న పీఎస్‌లకు హెల్పర్లకు 20 శాతం జీతాలు చెల్లిస్తామని చెప్పారని, తమ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 9వ తేదీన ఉత్తరాంధ్రలో అన్ని కలెక్టర్ కార్యాలయాలల్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. డెయిరీ యాజమాన్యం నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పెద్ద ఎత్తున ఆందోళన కార్యాచరణ రూపొందించుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, గౌరవాధ్యక్షుడు వై.ఎన్.భద్రం, యూనియన్ నాయకులు గంగుపాం కనకారావు, సూర్యారావు, ప్రసాద్, సన్యాసినాయుడు, రామారావు, అచ్చం నాయుడు పాల్గొన్నారు.

రేషన్‌కు బదులు నగదు బదిలీ ప్రక్రియను విరమించుకోవాలి

- సుదూర గిరిజన గ్రామాలకు ఎండీయూ వాహనాలతో రేషన్ అందించాలి
- 90 శాతం మేర గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులకు జమ కాని నగదు
- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న డిమాండ్



దేవరాపల్లి : ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్‌కు బదులు నగదు బదిలీ చేసే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రేషన్ డిపోలకు సుదూరంగా గిరిజన గ్రామాల ప్రజలకు ఎండీయూ వాహనాలతో రేషన్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీడీఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు చట్ట ప్రకారం 14 రకాల నిత్యవసర వస్తువులను పంపిణీ చేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం పదే పదే రేషన్ అవసరం లేకపోతే డబ్బులు తీసుకోవచ్చునని రేషన్ లబ్ధిదారులను ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకంలో 90 శాతం మేర లబ్ధిదారులకు నగదు ఖాతాలో జమకాలేదన్నారు. కేరళలో మాదిరిగా మూడు రకాల కార్డులను విధానాన్ని అమలు చేసి లబ్ధిదారులకు 17 రకాల నిత్యవసర సరుకులు అందించాలని కోరారు. రేషన్ మాఫియాకు ప్రధానంగా అధికార పార్టీ నాయకులే కారకులను ఆరోపించారు. మండలానికో ఏజెంట్‌ను నియమించుకొని రేషన్ బియ్యాన్ని సేకరించి రీసైక్లింగ్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో వామపక్షాల పోరాటాల ఫలితంగా దేశంలో 1955లో పీడీఎస్ వ్యవస్థను ప్రవేశపెట్టారని, దేశంలో 80 కోట్ల మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అసమానతలను నిర్మూలించేందుకు రేషన్ పంపిణీని కొనసాగించాల్సిందేనన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయం ప్రారంభోత్సవం



ఆలయ కమిటీ నిర్వాహకులను సత్కరిస్తున్న ముత్యాలనాయుడు

చోడవరం: చాకిపల్లి పంచాయతీ రామజోగిపాలెం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సర్పంచ్ పోతల జానకీ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలో నూతనంగా అభయాంజనేయస్వామి ఆలయం నిర్మించారు. శనివారం ఈ ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి వేదపండితుల వేద మంత్రాల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం, లక్ష తమలపాకు పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ మాడుగుల సమన్వయకర్త బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి కృషి చేసిన సర్పంచ్ ప్రసాద్‌తోపాటు కమిటీ ప్రతినిధులను ముత్యాలనాయుడు అభినందించారు. పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తీర్థప్రసాదాలు ఇచ్చి భారీ అన్నసమారాధన నిర్వహించారు.